ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి

జిల్లా వార్తలు


5★

శుక్రవారం 22 మార్చి 2024

కాంగ్రెస్ పెద్దపల్లి అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ

రామగుండంలో పర్యటించిన ఎన్టీపీసీ ఆర్ఈడీ

8లో..



మానేరులో ఇసుక తవ్వకాలకు గ్రీన్ సిగ్నల్



- ప్రస్తుతం ఉన్న క్వారీలకు మరో ఏడాది గడువు పొడిగింపు
- డిసెంబరు నెలాఖరుతో నిలిచిన ఇసుక తవ్వకాలు
- అనుమతించిన డీఎల్ఎస్‌సీ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మానేరు నదిపై గల పద్దెనిమిది ఇసుక క్వారీల్లో తవ్వకాలకు మరో ఏడాది పాటు గడువు పొడిగిస్తూ డిస్ట్రిక్ట్ లెవెల్ స్యాండ్ కమిటీ (డీఎల్ ఎస్‌సీ) నిర్ణయం తీసుకున్నది. ఇదివరకు క్వారీలను నిర్వహించిన కాంట్రాక్టర్లకే ఇసుక తోడే బాధ్యతను అప్పగించారు. గతంలో ఆయా క్వారీల్లో అనుమతించిన ఇసుకలో తోడింది పోను మిగింది తోడేందుకు అనుమతి ఇచ్చారు.

మానేరు నదిపై సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, గట్టెపల్లి, కదంబాపూర్, తొగర్రాయి, ఓదెల మండలం మడక, గుండ్లపల్లి, కనగర్తి, పొత్కపల్లి, రూప్‌నారాయణపేట, ఇందుర్తి, గుంపుల, కాల్వ శ్రీరాంపూర్ మండలం మీర్జంపేట్, మొట్లపల్లి, ముత్తారం మండలం ఓడేడు, అడవి శ్రీరాంపూర్, మంథని మండలం గోపాల్‌పూర్, చిన్న ఓదాల వద్ద నిర్మిస్తున్న చెక్‌డ్యామ్‌ల లోపల ఇసుక నిల్వలు బాగా ఉన్నాయని, అవి తోడకుండా చెక్ డ్యాములు నిర్మించడం వల్ల ఆశించిన మేరకు నీటి నిల్వలు ఉండవని అధికారులు భావించారు. ఆ మేరకు నీటి పారుదల శాఖ, భూగర్భ జల శాఖ, గనులు శాఖాధికారులు జాయింట్‌గా మానేరుపై ఎక్కడెక్కడ ఎంత ఇసుక నిల్వ ఉంది, ఎంత లోతులో తీయాలి, ఎన్ని క్వారీలను ఏర్పాటు చేయాలి అనే అంశంపై సర్వే నిర్వహించారు. ఆ మేరకు రెండు మీటర్ల లోతు వరకు 1,32,67,620 క్యూబిక్ మీటర్ల ఇసుకను తోడాలని, ఇందుకోసం 25చోట్ల క్వారీలను ఏర్పాటు చేయాలని డీఎల్ఎస్‌సీ నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదికను పరిశీలించిన అప్పటి ప్రభుత్వం ఇసుక క్వారీల కోసం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వాటి నిర్వహణ బాధ్యతను టీఎస్ఎండీసీకి అప్పగించారు.

2022 జనవరి 11వ తేదీన టీఎస్ఎండీసీ ఇసుక రీచుల్లో ఇసుకను తోడి వాహనాల ద్వారా డంపింగ్ యార్డుల వరకు తీసుకవచ్చి అక్కడ లోడింగ్ చేసేందుకు టెండర్లను ఆహ్వానించింది. పలువురు కాంట్రాక్టర్లు టెండర్లలో పాల్గొని ఇసుక రీచులను దక్కించుకున్నారు. 2023 డిసెంబర్ నెలాఖరు వరకు ఇసుక తవ్వకాలకు డీఎల్ఎస్‌సీ అనుమతి ఇచ్చింది. మానేరు నుంచి ఇసుకను తవ్వి స్టాక్ యార్డుల్లో పోసిన తర్వాత అక్కడినుంచి టీఎస్ఎండీసీ బుకింగ్ చేసుకున్న వారికి క్యూబిక్ మీటర్‌కు 650 రూపాయల చొప్పున విక్రయించింది. 25 ఇసుక రీచులను కాంట్రాక్టర్లు దక్కించుకున్నప్పటికీ అడవిశ్రీరాంపూర్ 1, అడవి శ్రీరాంపూర్ 2, కనగర్తి1, కనగర్తి 2, పొత్కపల్లి 1, పొత్కపల్లి 2, గుండ్లపల్లి 1, గుండ్లపల్లి 2, కిష్టంపేట్, గోపాల్‌పూర్, మడక 1, మడక 2, ముత్తారం, ఓడేడు 1, గుంపుల, ఇందుర్తి, కిష్టంపేట్ 2, తొగర్రాయి, నీరుకుల్ల, గొల్లపల్లి, తదితర క్వారీల నుంచి డిసెంబర్ నెలాఖరు వరకు సుమారు 65 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుకను తరలించారు. స్టాక్ యార్డుల్లో ఇంకా 5 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక పోశారు. ప్రస్తుతం ఆయా యార్డుల్లో నిల్వ ఉన్న ఇసుకను తరలిస్తున్నారు.

కలెక్టర్ అధ్యక్షతన సమావేశం..

ఇసుక తరలించడం వల్ల ఓదెల, కాల్వ శ్రీరాంపూర్, సుల్తానాబాద్, ముత్తారం, మంథని ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయని, రోడ్లన్నీ ధ్వంసం అవుతున్నాయని, దుమ్ము ధూళితో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, పర్యావరణ అనుమతులు లేకుండానే ఇసుక తవ్వకాలు చేపడుతున్నారని, వాటిని నిలిపివేయాలని మానేరు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పలువురు చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. దీనికి సంబంధించిన తీర్పు పెండింగులో ఉంది.

హైదరాబాద్‌లో భవన నిర్మాణాలు పెరగడంతో పాటు తదనుగుణంగా ఇసుక లేకపోవడం, రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, నూతన ఇసుక పాలసీని తీసుకవస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో ఇసుక క్వారీలను కొనసాగిస్తారా లేదా అనే చర్చ జరిగింది. మరోవైపు ఇసుక క్వారీల కాంట్రాక్టర్లు సైతం తమకు ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి రావాల్సిన బిల్లులు రాలేదని, తమకు ఇచ్చిన పరిమాణంలో ఇసుక తవ్వకాలు జరగనందున తమ కాంట్రాక్టును పొడిగించాలని ప్రభుత్వాన్ని కోరుతూ వచ్చారు. ఈనెల 7వ తేదీన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అధ్యక్షతన జరిగిన డీఎల్ఎస్‌సీ సమావేశంలో ఇసుక తవ్వకాలను వచ్చే ఏడాది మార్చి 15వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారని గనులు, భూగర్భ శాఖ ఏడీ శ్రీనివాస్ తెలిపారు.

సుల్తానాబాద్ మండలం గొల్లపల్లి, గట్టెపల్లి, కదంబాబపూర్, గుండ్లపల్లి, కనగర్తి, మడక, పొత్కపల్లి, రూప్ నారాయణపేట్, ఇందుర్తి, గుంపుల, మీర్జం పేట్, కిష్టంపేట్, మొట్లపల్లి, ఓడేడు, అడవి శ్రీరాం పూర్, గోపాల్‌పూర్, చిన్న ఓదాలలో క్వారీలు నిర్వహించేందుకు అనుమతించారు. ఈ క్వారీల నుంచి ఇప్పటివరకు సుమారు 70 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక తోడగా, ఇంకా 50 లక్షల నుంచి 60 లక్షల క్యూబిక్ మీటర్ల వరకు ఇసుక ఉంటుందని, తద్వారా ప్రభుత్వానికి 300 నుంచి 350 కోట్ల రూపాయల వరకు ఆదాయం వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్వారీలను గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన ఇసుక పాలసీ ప్రకారమే నిర్వహించనున్నారు.

సీఎంఆర్ డెలివరీ పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్

పెద్దపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ రైస్ డెలివరీని ఏప్రిల్ 30 లోగా తప్పనిసరిగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ మిల్లర్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ ఆయన సీఎంఆర్‌పై జిల్లాలోని రైస్‌మిల్లర్లు, సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌కు సంబంధించి 1,29,199.95 మెట్రిక్ టన్నులకు ఇప్పటివరకు 4,262టన్నుల బియ్యాన్ని డెలివరీ చేశారని,ఇంకా 1,24,937 టన్నుల బియ్యం ఇవ్వాల్సి ఉందన్నారు. వీటిని ఏప్రిల్ 30లోగా పూర్తి చేయాలని, గడువు పెంపు ఉండదని, నిర్దేశిత సమయంలోగా మిల్లుల వారీగా తమకు కేటాయించిన లక్ష్యం పూర్తిచేయాలని ఆదేశించారు. జాప్యం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి ఏ ప్రేమ్‌కుమార్, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, రైస్‌మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలి

● జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి రవీందర్



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్

కమాన్‌పూర్, మార్చి 21 : గ్రామాల్లో ఉపాధిహామీ పనులను ప్రాధాన్య క్రమంలో చేపట్టాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవీందర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్తు కార్యాలయంలో మంథని నియోజకవర్గ క్లస్టర్ క్షేత్రసహాయకుల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో చేపట్టబోయే ఉపాధిహామీ పనుల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డు చేయాలన్నారు. ఉపాధిహామీ పనులు చేపట్టే ప్రాంతంలో కూలీలకు సదుపాయాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పనుల నిర్వహణలో ఎట్టి పరిస్థితుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించవద్దన్నారు. అలాగే గ్రామాల్లోని నర్సరీల నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని నర్సరీలో మొక్కల ఎదుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఉపాధిహామీ కూలీల వేతనాలు సకాలంలో విడుదలయ్యేలా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ సత్యనారాయణ, జిల్లా అంబుడ్స్‌మెన్ శరత్, ఎంపీడీవో శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

షాపుల్లో కార్పొరేషన్ సిబ్బంది తనిఖీలు

కోల్‌సిటీ, మార్చి 21: రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పలు దుకాణాల్లో గురువారం కార్పొరేషన్ హెల్త్ సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. స్వీట్ హౌస్‌లు, బేకరీలలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నారు. 50కిలోల ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకుని రూ.3వేల జరిమానా విధించారు. ఈ తనిఖీల్లో హెల్త్ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, వైకుంఠం, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ రుణాలు సకాలంలో చెల్లించాలి

- మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్, మార్చి 21: బ్యాంకు నుంచి పొందిన రుణాలను తిరిగి సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ అన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బ్యాంకర్లు, రిసోర్స్ పర్సన్స్, మెప్మా సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి కొత్త రుణాలు పొందాలన్నారు. రుణాలు తీసుకున్న వారు సకాలంలో చెల్లించకపోవడంతో వారి సిబిల్ స్కోర్ పూర్తిగా తగ్గిపోయి భవిష్యత్తులో వారు ఎలాంటి రుణాలు పొందేందుకు అర్హతను కోల్పోతారన్నారు. ప్రతీ నెలా వాయిదాల గడువులో రుణ కిస్తులు చెల్లించాలన్నారు. మార్చి 31లోపు చెల్లించాలని సూచించారు. ఈ సమావేశంలో ఏడీఎంసీ మౌనిక, పలు బ్యాంకుల అధికారులు పాల్గొన్నారు.

విశ్వేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే విజయరమణారావును సన్మానిస్తున్న వేదపండితులు

కాల్వశ్రీరాంపూర్, మార్చి 21: మండలంలోని మల్యాల గ్రామంలో విశ్వేశ్వర ఆలయం 7వ వార్షికోత్సవ సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ రమణారావు మాట్లాడుతూ గత ఏడు సంవత్సరాల క్రితం ఈ గుడి గ్రామస్థుల దృష్టి పడకపోవడంతో ఆ గ్రామం మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, మాజీ సర్పంచ్ జక్క రవీందర్‌లు గుడి అభివృద్ధి కోసం ఆకనపల్లి చంద్రశేఖర్, శ్రీజ దంపతుల సహకారంతో గుడిని ఎంతో అభివృద్ధి చేసి అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దేవుని ఆశీస్సులతో గ్రామ ప్రజలతో పాటు మండల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. నిట్టూరి సతీష్ శర్మ, దత్తాత్రేయశర్మలచే ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు ఆకనపల్లి ప్రభావతి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మాజీ జెడ్పీటీసీ లంక సదయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజనవేన సదయ్య, మాజీ సర్పంచ్ జక్కె రవీందర్ పాల్గొన్నారు.

మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి

- ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి

మంథని, మార్చి 21: తెలంగాణలో మాదిగలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని, జనాభా దామాషా ప్రాతిపదికన రాష్ట్రంలో మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. స్థానిక ఫ్రెండ్స్ క్లబ్‌లో గురువారం జరిగిన మాదిగ జేఏసీ ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. బీజేపీ కేంద్ర ప్రభుత్వం మాదిగలను మోసం చేసే దిశగా వర్గీకరణ అంశం ముందుంచి రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగల ఓట్లు వేయించుకుని గెలవాలని చూస్తోందన్నారు. మాదిగలు వారి మాటలు నమ్మవద్దని, బీజేపీ మరల కేంద్రంలో అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు మొత్తం ఎత్తివేయడం ఖాయమన్నారు. తమకు కావలసినది రాష్ట్రంలో మాదిగల దామాషా ప్రకారం 12 శాతం రిజర్వేషన్లు కలిగిన వర్గీకరణ జరగాలన్నారు. పార్లమెంట్‌లో బీజేపీకి ఓట్లు వేయవద్దన్నారు. ఈకార్యక్రమంలో నేతలు తగరం శంకర్ లాల్, మంథని సత్యం, బూడిద శంకర్, మంథని లక్ష్మణ్, మైన ఉపేందర్, అక్కపాక తిరుపతి, దుబ్బయ్యలు పాల్గొన్నారు.

26వరకు ఇంటి పన్ను వసూలు పూర్తిచేయాలి

- జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత



సమావేశంలో మాట్లాడుతున్న డీపీవో ఆశాలత

పెద్దపల్లి రూరల్, మార్చి 21: జిల్లాలోని గ్రామాల్లో ఇంటిపన్ను బకాయిలు ఈనెల 26నాటికి వంద శాతం వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. గురువారం మండలంలోని కమాన్‌పూర్, పెద్దపల్లి మండలాల పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా డీపీవో ఆశాలత మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీ తాగునీటికి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుకాణాలకు ట్రేడ్‌లైసెన్స్‌లు అందించాలన్నారు. పారిశుధ్యం, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అక్రమంగా ఏర్పాటుచేస్తున్న వెంచర్‌లపై తగిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ అనుమతి లేనిదే ఏర్పాటుచేస్తే వాటిని అరికట్టాలన్నారు. గ్రామాల్లో ఇంటి నిర్మాణాలు చేపడితే ఆలసత్వం వహించకుండా తప్పనిసరిగా అందించాలన్నారు. దీంతో మురుగుకాలువలు శుభ్రం, చెత్తాచెదారం లేకుండా గ్రామాలను శుభ్రంగా ఉంచాలన్నారు. వేసవి సెలవులు సమీపిస్తుండటంతో గ్రామాల్లో పిల్లల సందడి కార్యక్రమాన్ని ఏర్పాటుచేయనున్నట్లు, దీనిపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామ పంచాయతీ తప్పనిసరిగా ప్రతి అంశాన్ని రిజిష్టర్ నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో పెద్దపల్లి ఎంపీడీవో గున్నాల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీవోలు సుదర్శన్, శేషయ్య సూరిలతో పాటు రెండు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంతర పంటలతో మెరుగైన ఆదాయం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ఒడేదులో అంతరపంటలను పరిశీలిస్తున్న కలెక్టర్

ముత్తారం, మార్చి 21: ఆయిల్‌పామ్ సాగు ద్వారా మొదటి మూడు సంవత్సరాలు అంతరపంటలతో మెరుగైన ఆదాయం లభిస్తుందని, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. అంతరపంటల సాగు పటిష్టంగా చేసే విధంగా అవసరమైన సహాయసహకారాలు వ్యవసాయ, ఉద్యాన శాఖల ద్వారా అందిస్తామన్నారు. గురువారం మండలంలోని ఓడేడు గ్రామంలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పర్యటించి ఆయిల్‌పామ్ తోటలో వేసిన అంతర పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడి అంతర పంటల వల్ల కలుగుతున్న లాభాలు, ఇతర సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌కు పంట వివరాలను తెలియజేశారు. దాదాపు 110 ఎకరాల్లో ఆయిల్‌పామ్ పంట వేసి రెండు సంవత్సరాలు దాటిందని, వచ్చే సంవత్సరం దిగుబడి ఆశించే విధంగా ఉన్నదని తెలిపారు. ఆయిల్‌పామ్ పరిశ్రమ ప్లాంట్ రాచపల్లిలో తొందరగా ప్రారంభిస్తే మిగతా రైతులలో నమ్మకం కలిగి చాలా మంది ముందుకు వచ్చే అవకాశం ఉన్నదని, మరింత ఎక్కువగా సాగు చేసే అవకాశం ఉంటుందని కలెక్టర్‌కు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై క్షేత్రస్థాయి పర్యటన రెండు రోజులు నిర్వహించాలని రైతులు కోరారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, రైతులకు సంపూర్ణంగా సహాయసహకారాలు అందిస్తామని ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా కృషి చేయాలని కోరారు. ప్రత్యామ్నాయ పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందన్నారు. ఆయిల్‌పామ్ సాగును వరికి ప్రత్యామ్నాయంగా ప్రోత్సహిస్తున్నామని, ఆయిల్‌పామ్ సాగు లాభాలు, ప్రభుత్వం కల్పించే సబ్సిడీలపై వ్యవసాయ విస్తరణ అధికారులు విస్తృతప్రచారం నిర్వహిస్తారని, అదే సమయంలో రైతులు సైతం ఇతరులకు ఆయిల్‌పామ్ సాగుతో వచ్చే లాభాల గురించి వివరించాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు అంతరపంటల్లో కోకో, తమలపాకు మొదలగు వాణిజ్య పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. క్షేత్రస్థాయి పర్యటన సందర్భంగా అధిక లాభం వచ్చే అంతరపంటలు, వాటి సాగు అవసరమైన నేల, పాటించాల్సిన పద్ధతులపై అవగాహన పెంచుకోవాలన్నారు. రైతులు పండించే అంతరపంటలకు మంచి మార్కెటింగ్ ఉండే దిశగా అవసరమైన సహాయసహకారాలు అందిస్తామన్నారు. భూసమస్యలు ఉన్న రైతులకు వాటి పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సహాయకేంద్రాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశామని, దీని ద్వారా మన దరఖాస్తు స్థితిగతులు తెలుసుకోవచ్చని, రైతులు వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. ధరణి ద్వారా రైతులకు ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, కోర్టు కేసుల్లో ఉన్న భూవివాదాలు మాత్రమే పెండింగ్‌లో ఉంటున్నాయని పేర్కొన్నారు. ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు సమాచారం అందితే సంబంధిత అధికారులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జగన్మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి చిందం శ్రీకాంత్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి : సీపీ శ్రీనివాస్



వాహనాల తనిఖీని పర్యవేక్షిస్తున్న సీపీ శ్రీనివాస్

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: విధి నిర్వహణలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో గురువారం పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల సరిహద్దు గోదావరి బ్రిడ్జి చెక్ పోస్టును సీపీ తనిఖీ చేశారు. వాహనాల తనిఖీని పర్యవేక్షించారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, బస్సులు, ద్విచక్రవాహనాలను తప్పనిసరిగా తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. వాహనాల తనిఖీ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, రాత్రి సమయంలో రేడియం జాకెట్లు ధరించాలని సూచించారు. మద్యం, నగదు, బంగారం, ఇతర విలువైన వస్తువులు తరలిస్తుంటే వెంటనే స్వాధీనం చేసుకుని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. రూ. 50,000 కంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకెళ్ళే వ్యక్తుల వద్ద నగదుకు సంబంధించి ధృవపత్రాలను నిశితంగా పరిశీలించాలని, ధృవపత్రాలు సరిగ్గాలేని వారి వద్ద నగదును సీజ్ చేసి గ్రీవెన్స్ కమిటీకి అప్పగించాలని సూచించారు. 10లక్షల కంటే ఎక్కువ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకుంటే ఆదాయపన్ను విభాగానికి అప్పగించాలని సీపీ సూచించారు. చెక్‌పోస్టు వద్ద విధుల్లో ఉండే సిబ్బందికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సీపీ శ్రీనివాస్ సూచించారు. సీపీ వెంట గోదావరిఖని ఏసీపీ రమేష్, సీఐ ఇంద్రసేనారెడ్డి ఉన్నారు.

సర్వే ల్యాండ్ రికార్డ్ కార్యాలయం తనిఖీ



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సర్వే ల్యాండ్ రికార్డు కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో పని చేసే సిబ్బంది వివరాలను ఏడీ శ్రీనివాసులు ద్వారా తెలుసుకోవడంతో పాటు రికార్డులను కూడా పరిశీలించారు.

ఎక్లాస్‌పూర్ చెక్‌పోస్ట్ తనిఖీ



చెక్‌పోస్టును తనిఖీ చేస్తున్న ఆర్డీవో

మంథనిరూరల్, మార్చి 21 : మండలంలోని ఎక్లాస్‌పూర్ వద్ద పార్లమెంట్‌లో ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును గురువారం మంథని ఆర్డీవో హనుమానాయక్ తనిఖీచేశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. చెక్‌పోస్టు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వరి పంటకు బోనస్ ప్రకటించాలి

హుజూరాబాద్‌రూరల్: వరి పంటకు ఈ ఖరీఫ్ సీజన్ నుంచే రూ. 500ల బోనస్ ప్రకటించాలని రాష్ట్ర కర్షక రైతు అభివృద్ధి సమితి నాయకులు కోరారు. గురువారం మండలంలోని రాంపూర్‌లో వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్‌కు రూ.2,203, బి గ్రేడ్‌కు రూ.2183 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు రావుల భాస్కర్‌రెడ్డి, సాదులా అంశరెడ్డి, చల్లూరి సారయ్య, జక్కోజు ఆంజనే యులు, చల్లూరి ఆగయ్య, రూపిరెడ్డి మల్లారెడ్డి, గంగుల శ్రీనివాస్, రాజు, ఎర్ర రవీందర్ తదితరులు ఉన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని దమ్మక్కపేట గ్రామంలో నీళ్లు లేక ఎండిపోయిన పంటలను మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పంటనష్టం జరిగిన ప్రతి ఒక్క రైతుకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ పంట నష్టం కింద రూ.10వేలు అందించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాష్ట్రంలోని ప్రతి రైతుకు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కొండాల్‌రెడ్డి, రైతులు, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

10లీటర్ల మద్యం పట్టివేత

సైదాపూర్, మార్చి 21: సైదాపూర్ మండల శివారులో ఓ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 10.980లీటర్ల మద్యం పట్టుకొని ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి మద్యం సీజ్ చేసినట్లు ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా బొమ్మనపల్లి గ్రామానికి చెందిన రాజయ్య అనే వ్యక్తి కాటన్ డబ్బాలో మద్యం తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. పట్టుకున్న మద్యం విలువ సుమారు రూ. 9,900లు ఉంటుందని తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున బెల్టు షాపులు నిర్వహించిన, డీజేలు నడిపిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై జన్ను ఆరోగ్యం తెలిపారు.

ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్న గ్రామస్థులు

మానకొండూర్, మార్చి 21: మండలంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామంలో గురువారం గ్రామస్థులు ఇసుక ట్రాక్టర్‌లను అడ్డుకున్నారు. మానేరు వాగు నుంచి ప్రతినిత్యం అక్రమంగా ఇసుక తరలించడం వల్ల దుమ్ము, ధూళితో పాటు అతివేగంగా నడపడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పట్టించుకొని అక్రమ ఇసుకను అరికట్టాలని కోరుతున్నారు. రెండు గంటల పాటు ట్రాక్టర్‌లను ఆపారు.

మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

మానకొండూర్, మార్చి 21 : మానకొండూర్ పంచాయతీ కార్యదర్శి వి. శ్రీనివాస్‌ను జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు మండల అభివృద్ధి అధికారి నర్సయ్య తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూమిలో ఓ వ్యక్తికి అక్రమంగా ఇంటి నెంబరు కేటాయించారు. దీంతో గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టి పంచాయతీ కార్యదర్శిని రెండు రోజుల క్రితం సస్పెండ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీడీవో తెలిపారు.

రూ.7,750 పలికిన పత్తి ధర

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.7,750 పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 63మంది రైతులు 843క్వింటాళ్ల విడి పత్తి, ఏడుగురు రైతులు తొమ్మిది క్వింటాళ్ల గోనె సంచుల్లో పత్తి విక్రయానికి తీసుకువచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.7,750, కనిష్ఠ ధర రూ.6వేలు చెల్లించి కొనుగోళ్లు చేపట్టారు.

బెల్ట్‌షాప్ నిర్వాహకుల అరెస్ట్

ముస్తాబాద్, మార్చి 21: ముస్తాబాద్ మండలం గూడెం గ్రామంలో బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించి ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గ్రామంలో బెల్ట్‌షాపుల నిర్వహిస్తున్న ఈడుగురాళ్ల రాజేశంగౌడ్ వద్ద 18,450 రూపాయలు, కొమిరె ఎల్లం వద్ద 9,060 రూపాయలు, ఈడుగురాళ్ల రామచంద్రం వద్ద 20,000 రూపాయల విలువైన మద్యంను సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ముస్తాబాద్ ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

వేములవాడ, మార్చి 21: వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి వీధిలో తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పొన్నం రవి అనే వ్యక్తి బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చి చూసేసరికి ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడాన్ని గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. ఇంట్లో ఉన్న కొంత నగదు అపహరణకు గురయ్యాయని రవి చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ కరుణాకర్ తెలిపారు.

వృద్ధురాలిని తాళ్లతో కట్టేసి చోరీ

సిరిసిల్ల క్రైం, మార్చి 21: సిరిసిల్ల పట్టణంలోని బీవైనగర్‌లో పర్కాల శ్రీలక్ష్మి అనే వృద్ధురాలి ఇంట్లో చోరీ జరిగింది. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం... పట్టణంలోని బీవైనగర్‌లో బుధవారం రాత్రి 10.30గంటలకు గుర్తుతెలియని నలుగురు వ్యక్తులు ఇంట్లోకి చొరబడ్డారు. ఇంట్లో ఒంటరిగా ఉంటున్న శ్రీలక్ష్మి అనే వృద్ధురాలిని నలుగురు వ్యక్తులు బెదిరించి తాళ్లతో కట్టేసి దోచుకున్నారు. ఆమె ఇంట్లో దాచిన ఆరువేల రూపాయలను, ఒక గ్రాము బంగారం, 12గ్రాముల వెండి నగలు ఎత్తుకొని వెళ్లారు. గురువారం ఉదయం పక్కింటివారు వచ్చి కట్లు విప్పేశారు. దీంతో బాధితురాలు శ్రీలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతి తెలిపారు. నలుగురు నిందితులు ఏ వైపు నుంచి వచ్చారని సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

గంభీరావుపేట, మార్చి 21: గంభీరావుపేట మండలం సముద్రలింగాపూర్ గ్రామం వద్ద ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు ఎస్సై రామ్మోహన్ గురువారం తెలిపారు. మండలంలోని మల్లుపల్లె వాగు నుంచి ట్రాక్టర్‌పై అక్రమంగా ఇసుక తరలిస్తుండగా లింగాపూర్ బస్ స్టేజి వద్ద పట్టుకున్నట్టు తెలిపారు. ఇసుక ట్రాక్టర్లు పోలీస్‌స్టేషన్ తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

చందుర్తి, మార్చి 21: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి బస్టాండ్ వద్ద బస్సు ఢీకొన్న సంఘటనలో ఓ వృద్ధుడికి గాయాలయ్యాయి. గ్రామస్థుల కథనం ప్రకారం..మండలంలోని ఎన్గల్ గ్రామానికి చెందిన బత్తుల జయరాజ్ అనే వ్యక్తి రోడ్డుపై వెళ్తుండగా వేములవాడ నుంచి కోరుట్ల వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో వృద్ధుడు రోడ్డుపై పడిపోవడంతో స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం వేములవాడ ఆస్పత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ గీత కార్మికుడు మృతి


రాజమల్లయ్య(ఫైల్)

మెట్‌పల్లి రూరల్, మార్చి, 21: మండలంలోని ఆత్మనగర్ గ్రామానికి చెందిన చిలివేరి రాజమల్లయ్య అనే గీత కార్మికుడు ఆసపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువలు తెలిపిన వివరాల ప్రకారం.. ఫిబ్రవరి 22న గ్రామంలోని తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడ్డాడు. ప్రమాదంలో రాజమల్లయ్యకు రెండు కాళ్లు విరిగి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో వైద్యుల సూచనల మేరకు మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని యశోద ఆసపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న చిలివేరి రాజమల్లయ్య గురువారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

హనుమాన్ ఆలయంలో దొంగతనం


సీసీ కెమెరాలను పరిశీలిస్తున్న సీఐ కరుణాకర్

వేములవాడ టౌన్, మార్చి 21: వేములవాడ మండలంలోని ఆరెపల్లి గ్రామంలో గల హనుమాన్ ఆలయంలో గుర్తుతెలియని వ్యక్తులు సీతమ్మ వారి పుస్తెమట్టెలు బుధవారం రాత్రి అపహరించుకుపోయారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆరెపల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి చొరబడి సీతమ్మవారి మెడలోని పుస్తెమట్టెలు అపహరించడంతో పాటు హుండీని పగలగొట్టి డబ్బులను దొంగలించినట్లు తెలిపారు. దీంతో గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఒకరికి శిక్ష

కరీంనగర్ క్రైం, మార్చి 21 : మోతాదుకు మించి అధికంగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసుల తనిఖీలలో పట్టుబడిన 14 మంది వ్యక్తులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఒక వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష, రూ. 2,500లు జరిమానా విధించారని కరీంనగర్ ట్రాఫిక్ సీఐ కరీంఉల్లాఖాన్ తెలిపారు. మిగతా 13 మందికి 22 వేల రూపాయలు జరిమానావిధించినట్లు తెలిపారు.

వైభవంగా ధర్మపురి బ్రహ్మోత్సవాలు


ధర్మపురిలో కల్యాణానికి పట్టు వస్త్రాలు తీసుకవస్తున్న కలెక్టర్


ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం

ధర్మపురి, మార్చి 20: ధర్మపురి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీ లక్ష్మీ నృసింహ, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల కల్యాణోత్సవానికి ప్రభుత్వం పక్షాన కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా గురువారం పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. ఉదయం క్షేత్రానికి చేరుకున్న కలెక్టర్, అధికారులకు ఈవో సంకటాల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ చైర్మన్ జక్కు రవీందర్, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మంగళ వాయిద్యాలు వెంట రాగా కలెక్టర్ పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు నెత్తి మీద పెట్టుకుని ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపి ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి చేతుల మీదుగా స్వామి వారలకు సమర్పించారు. వేద బ్రాహ్మణుల మంత్రోచ్ఛరణల మధ్య అర్చకులు వారిని ఘనంగా ఆశీర్వదించారు. ఆలయ ఈవో కలెక్టర్‌కు స్వామి శేష వస్త్రాలు, ప్రసాదాలు అందించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి చైర్‌పర్సన్ సంగి సత్యమ్మ ఆధ్వర్యంలో కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు, పుస్తెలు, మట్టెలు సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల ఆర్‌డీవో మదుసూధన్, డీఎఫ్‌వో వేంకటేశ్వర్‌రావు, డీఎంహెచ్‌వో డాక్టర్ పుప్పాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి

బ్రహ్మోత్సవాల్లో భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. స్థానిక దేవాలయం వద్ద ఆమె కొద్ది సేపు విలేకరుల సమావే శంలో మాటాడారు. వసతుల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ఆయా శాఖల ఉన్నతాధికారులు కింది స్థాయి సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఘనంగా స్వామి వారల ఎదుర్కోలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి, శ్రీ వేంకటేశ్వర స్వామి వారల ఎదుర్కోలు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముందు ఆలయ అర్చకులు చిలుకముక్క అశ్విన్ ఇంటికి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారల ఉత్సవ మూర్తులను తీసుకొచ్చారు. అర్చకులు నేరెళ్ల వంశీకృష్ణ ఇంటికి శ్రీ వేంకటేశ్వర స్వామి వారలను తీసుకవచ్చారు. ప్రత్యేకంగా అలంకరణ చేసిన వేదికపై ఆశీనులు చేసిన ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా పూజలు జరిపి ఎదుర్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎదుర్కోలు అనంతరం స్వామి వారల ఉత్సవ మూర్తులను ఆలయానికి తీసుక వెళ్లారు. ప్రధాన ఆలయం ఎదుట ధ్వజారోహణం నిర్వహించారు.

నిలిపిఉన్న లారీని ఢీకొని యువకుడి మృతి

ఫైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: గోదావరిఖని మంథని రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మంద కిరణ్ అనే యువకుడు మృతి చెందాడు. గోదావరిఖని కాకతీయనగర్‌కు చెందిన కిరణ్ తన మిత్రుడు రాకేష్‌తో కలసి ద్విచక్రవాహనంపై మంథనివైపు వెళ్తుండగా 3 ఇంక్లయిన్ సమీపంలో రోడ్డు పక్కన నిలిపి ఉంచిన బొగ్గు లారీని ఢీకొట్టాడు. తల భాగంలో బలమైన గాయాలు కావడంతో కిరణ్ అక్కడికక్కడే మరణించాడు. రాకేష్ తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతున్నాడు.

ఇద్దరిపై కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: జమ్మికుంట మండలంలో వేర్వేరు సంఘటనల్లో గురువారం ఇద్దరు వ్యక్తులపై పోలీస్‌లు కేసు నమోదు చేశారు. విలాసాగర్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే వ్యక్తి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పోలీస్‌లు పట్టుకుని కేసు నమోదు చేశారు. అదే విధంగా కోరపల్లి గ్రామానికి చెందిన వడ్నాల ఆశోక్ బెల్ట్ షాపు నిర్వహిస్తుండగా, అతడి వద్ద రూ.5వేల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

అదనపు వరకట్నం కేసు నమోదు

జమ్మికుంట, మార్చి 21: అదనపు కట్నం కావాలని అత్తింటి వారు వేధిస్తున్నారని ఓ మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై బుధవారం కేసు నమోదు చేశారు. పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. జమ్మికుంటకు చెందిన తాళ్లపల్లి ప్రవళికతో తాళ్లపల్లి అజయ్‌కుమార్‌కు 2019లో వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రవళిక తల్లిదండ్రులు వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. కొంత కాలంగా అదనపు వరకట్నం పది లక్షలు కావాలని అత్తింటి వారు వేదిస్తున్నారంటూ ప్రవళిక పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. భర్త అజయ్ కుమార్, అత్త యశోద, మామ శ్రీహరి, మరిది విజయకుమార్, ఆడబిడ్డ రేష్మ, బైరెడ్డి శివసాయిలపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వరంగంటి రవి తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయురాలు

● విద్యార్థి సంఘాల ఆందోళన


విద్యార్థి పునీత్ వీపుపై గాయాలు

కోల్‌సిటీటౌన్, మార్చి 21: గోదావరిఖని ఎల్‌బీనగర్‌లోని ఇండో అమెరికన్ స్కూల్‌లో 3వ తరగతి విద్యార్థి మేకల పునీత్‌ను టీచర్ చితకబాదింది. సైన్స్ సబ్జెక్టులో మార్కులు తక్కువ వచ్చాయని పునీత్‌ను బుధవారం టీచర్ కొట్టడంతో చేతులు, వీపు పైన వాతలు వచ్చాయి. ఈ విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు చెప్పడంతో వారు గురువారం పాఠశాలకు వచ్చి యాజమాన్యాన్ని నిలదీశారు. విషయం తెలుసుకున్న ఎన్ఎస్‌యూఐ నాయకుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశా రు. ఈ విషయమై వాట్సాప్ ద్వారా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) కౌన్సిలర్ సతీష్ ఆధ్వర్యం లో విచారణ చేపట్టారు. విద్యార్థి ఇంటికి వెళ్లి వివరాలు అడిగి తెలుసుకు న్నారు. సేకరించిన వివరాలతో కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని సతీష్ తెలిపారు. పిల్లలకు ఎలాంటి ఇబ్బంది కలిగినా 1089 ట్రోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

వైద్య ఆరోగ్యశాఖలో డేటాను సకాలంలో ఆన్‌లైన్ చేయాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సుమన్‌మోహన్‌రావు


పాల్గొన్న వైద్యాధికారులు, సిబ్బంది

● సిరిసిల్ల డీఎంహెచ్‌వో డాక్టర్ సుమన్‌మోహన్‌రావు

సిరిసిల్ల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖలో కార్యక్రమాల అమలు తీరు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని రాజన్నసిరిసిల్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుమన్ మోహన్‌రావు సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఎంఎల్‌హెచ్‌పీ డాక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఏఎన్ఎంలు, సిబ్బందికి హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన, డేటా శిక్షణను నిర్వహించారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధి లక్షణాలు, రోగ నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ కేంద్రాల పనితీరు, ఇతర అంశాలపై ఉమ్మడి జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ నిర్వహణ అధికారి సురేందర్‌రెడ్డి అవగాహన కల్పించారు. డేటా సేకరణతో పాటు సకాలంలో సక్రమంగా ఆన్‌లైన్ చేయాలన్నారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం చూపకూడదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఉమ, డీడీఎం కార్తీక్, ఏవో శ్రీనివాస్, డిప్యూటీ డీఎంవో బాలయ్య, డీఎస్‌వో పద్మయ్య, సత్యనారాయణ, శ్రీనివాస్, ఐసీటీసీ కౌన్సిలర్ గంగయ్య, దయాకర్, శ్రీనివాస్, శివ, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర అధ్యయనంతో ఉద్యోగ అవకాశాలు



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి రాజశేఖర్

గణేశ్‌నగర్,మార్చ్ 21: డిగ్రీ తర్వాత యువతకు విస్తృత ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని, ప్రతిభ, నిరంతర కృషి, సూక్ష్మ పరిశీలన, అధ్యయన శీలత, క్రమశిక్షణ, వార్తా పత్రికల విశ్లేషణ, బృంద చర్చలు, ప్రణాళిక, లక్ష్యంతో కూడిన లోతైన విషయ అవగాహనతో ఉద్యోగ సాధన సాఫల్యం అవుతుందని హైదరాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం సీనియర్ ప్రొఫెసర్ ఆచార్య బి రాజశేఖర్ అన్నారు. గురువారం స్థానిక ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్‌సైన్స్‌కళాశాల (అంతర్గత నైపుణ్యాల సాధన విభాగం) ఆధ్వర్యంలో కెరీర్ ప్లానింగ్‌పై నిర్వహించిన కార్యశాలలో ఆచార్య రాజశేఖర్ మాట్లాడారు. చదువు కేవలం డిగ్రీల కోసం కాకుండా ప్రతిభ, విషయ సాధికారత, ప్రజ్ఞా సామర్థ్యాల పెంపుదల దిశగా జరగాలన్నారు. నచ్చిన అంశాలలో విస్తృత అవకాశాలు ఆధునిక యుగంలో అందుబాటులో ఉన్నాయన్నారు. కేవలం సాఫ్ట్‌వేర్, కమ్యూనికేషన్, ఐటీ రంగాలే కాకుండా జర్నలిజం, లలిత కళలు, వంటి ఎన్నో అవకాశాలు గ్లోబల్ స్థాయిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షులుగా ఉన్న ఎస్సారార్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ మాట్లాడుతూ ఎస్సారార్ కళాశాల నైపుణ్య వికాస కేంద్రంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజయ్య, డా కే సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్, కే మల్లారెడ్డి, ఏ శ్రీనివాస్, ఎం అర్చన, వరప్రసాద్, శారద పాల్గొన్నారు.

కుష్ఠు వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ



బోర్నపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

హుజూరాబాద్, మార్చి 21: హుజూరాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని బోర్నపల్లి గ్రామంలో జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా గురువారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి లక్షణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆశావర్కర్లు ఇంటింటికి తిరుగుతూ కుష్ఠు వ్యాధి లక్షణాలను గుర్తించారు. లెప్రసీ నోడల్ పర్సన్ రమేష్, ఏఎన్ఎం వనిత, ఆశావర్కర్లు అరుణ, రమాదేవి, మున్సిపల్ వార్డు అధికారులు లత, పారిజాతం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో ప్రతిభను వెలికి తీయాలి



మాట్లాడుతున్న వీసీ సంకశాల మల్లేష్

● ఎస్‌యూ వీసీ సంకశాల మల్లేష్

గణేశ్‌నగర్, మార్చి21: విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి ఆరోహణ 2024 స్టూడెంట్ మీట్ లాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడుతుందని ఎస్‌యూ విసి ఆచార్య సంకశాల మల్లేష్ తెలిపారు. గురువారం శాతవాహన విశ్వవిద్యాలయంలోని బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో ఏర్పాటు చేసిన శాతవాహన ఆరోహణ 2024 ఎంబీఏ, బీబీఏ విద్యార్థులకు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ శాతవాహన యూనివర్సిటీలో కొవిడ్ తర్వాత ఒక మంచి కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. స్కిల్ ఓరియెంటెడ్ ప్రోగ్రామ్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కు ప్రిపేర్ అయ్యేవారికి, మార్కెట్‌కు సంభందించిన వాటికి ప్రిపేర్ అయ్యేవారికి ఉపయోగ పడుతుందన్నారు. విద్యార్థుల్లో కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, ఇంటర్వ్యూ విధానంపై అవగాహన కల్పించడమే దీని ముఖ్య ఉద్దేశమని వివరిం చారు. ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతిభ ఉన్న వారిని గ్లోబల్ వ్యవస్థకు అనుగుణంగా తయారు చేయడం కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ రాజశేఖర్, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి హరికాంత్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్వీ శ్రీరంగ ప్రసాద్, డాక్టర్ ఈ మనోహర్, ఎంబీఏ ఫ్యాకల్టీ డాక్టర్ మనోజ్ కుమార్ , డాక్టర్ టి.కృష్ణకుమార్, కామర్స్ ఫ్యాకల్టీ డాక్టర్ కే తిరుపతి, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ సావిత్రి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌లపై పోలీసుల దాడులు


మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కోనరావుపేట, మార్చి 21: మండలంలోని మల్కపేటలో బెల్ట్‌షాపులపై చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కోనరావుపేట ఇన్‌చార్జి ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి గురువారం దాడులు నిర్వహించారు. మల్కపేట గ్రామానికి చెందిన భోగి నాగరాజు, కుంట వెంకటి ఇంట్లో సోదాలు నిర్వహించగా సుమారు తొమ్మిది వేల రూపాయల విలువ గల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు


తవ్వకాల్లో బయటపడ్డ విగ్రహాలు

ఎండపల్లి, మార్చి21; ఉపాధిహామీ కార్మికుల తవ్వకాలలో పురాతన విగ్రహాలు బయటపడ్డ సంఘటన మండలంలోని చెర్లపల్లి గ్రామంలో జరిగింది. కార్మికులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారీ లాగే కార్మికులు గురువారం గ్రామంలోని ఎల్కల దేవి గుట్టకు కందకాలు తవ్వడానికి కూలీలు వెళ్లారు. పనిచేస్తుండగా 15 పురాతన విగ్రహాలు బయటపడగా గ్రామస్థులు అక్కడికి చేరుకొని పూజలు నిర్వహించారు. విషయం సంబంధిత అధికారులకు తెల్పడంతో వారు విగ్రహాలను పరిశీ లించారు. విగ్రహాలు ఎప్పటివో తెలియడం కోసం పురావస్తుశాఖ వారికి సమాచారం ఇవ్వనున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

తిమ్మాపూర్‌లో యూనిసెఫ్ సెంట్రల్ టీం సందర్శన


తిమ్మాపూర్‌లో పరిశీలిస్తున్న యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు

తిమ్మాపూర్, మార్చి21: తిమ్మాపూర్ మండల కేంద్రంలో యూనిసెఫ్ సెంట్రల్ టీం సభ్యులు సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యలయం వద్ద ఏర్పాటు చేసిన కంపోస్ట్ స్టాల్, శానిటరీ సిబ్బంది మెటీరియల్ స్టాల్, శానిటరీ పరికరాల స్టాల్‌లను పరిశీలించారు. అంగన్వాడీలలో రిట్రో ఫిటింగ్ టాయిలెట్‌లను, విట మిన్ గార్డెన్‌లను పరిశీలించారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పారిశుధ్య కార్మికులకు నిర్వహిస్తున్న ఆరోగ్య శిబిరాన్ని బృందం సభ్యులు పరిశీలించి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచ నలు చేసి పనులపై సంతృప్తి వ్యక్తం చేసి అధికారులను, సిబ్బందిని అభినందిచారు. ఢిల్లీ యూనిసెఫ్ కార్యాలయం నుంచి కౌశిక్ బెనర్జీ, అరలికట్టి వెంకటేష్ , మురళీకృష్ణ, కొండవీటి ఫణీంద్ర, ఎంపిడివో విజయ్ కుమార్, ఎంపివో కిరణ్ కుమార్, యూనిసెఫ్ జిల్లా కోఆర్డినేటర్ కిషన్ స్వామి సిబ్బంది పాల్గొన్నారు.

కరీంనగర్ బస్టాండ్‌ను తనిఖీ చేసిన ఆర్‌ఎం

భగత్‌నగర్, మార్చి 21: కరీంనగర్ బస్టాండ్‌ను తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కరీంనగర్ రీజినల్ మేనేజర్ ఎన్ సుచరిత బుధవారం తనిఖీ చేశారు. బస్టాండ్‌లోని టాయిలెట్స్ లహరి ఏసీ బస్సులు, స్టాల్స్‌ను తనిఖీ చేశారు. డిప్యూటి రీజినల్ మేనేజర్స్ భూపతిరెడ్డి, సత్యనారాయణ, పర్సనల్ ఆఫీసర్ చంద్రయ్య, డిపో మేనేజర్లు మల్లయ్య, మల్లేశం, కార్గో ఎటిఎం సదాశివ, బస్‌స్టేషన్ మేనేజర్ రజనీకృష్ణ పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు

- రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మార్చి 21: రామగుండం కమిషనరేట్ పరిధిలో మహిళల భద్రతకు పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నామని, వారిని వేధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలకు పని ప్రదేశాల్లో, ప్రయాణాల్లో మహిళలను వేధింపుల నుంచి రక్షించేందుకు షీటీమ్ బృందాలను ఏర్పాటు చేశామని, అన్నివేళలా అందుబాటులో ఉంటాయన్నారు. సమస్యలను షీటీమ్ బృందాలకు నేరుగా ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేదని, డయల్ 100, వాట్సాప్, క్యూఆర్ కోడ్ ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఆడపిల్లలను వేధించినా, అసభ్యంగాప్రవర్తించినా, ఫోటోలు, వీడియోలు మార్ఫింగ్ చేసినా, సోషల్ మీడియా అకౌంట్లలో పోస్టు చేసినా, షేర్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ ఏడాది కమిషనరేట్‌లో షీ టీమ్‌లు 166 అవగాహన కార్యక్రమాలు నిర్వహించాయని, 15మంది అమ్మాయిలను వేధింపుల నుంచి కాపాడారని, కేసులు నమోదు చేసి కౌన్సెలింగ్ చేసి, బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఇంటర్మీడియట్, 10వ తరగతి పరీక్ష కేంద్రాల వద్ద ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ అమ్మాయిలను వేధిస్తున్న 12మంది ఆకతాయిలను పట్టుకుని ఏడు మోటార్‌బైక్‌లను స్వాధీనం చేసుకున్నామని, పెద్దపల్లి, మంచిర్యాల, సీసీసీ నస్పూర్ ఠాణాల్లో కేసులు నమోదు చేశామన్నారు. ఎవరైనా మహిళలు వేధింపులకు గురైతే డయల్ 100, షీటీమ్ నంబరు 6303923700కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

సంక్షిప్త సమాచారం

● ధర్మారం : మంత్రి పొన్నం ప్రభాకర్‌కు గురువారం సాయంత్రం ధర్మారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. ధర్మపురిలో శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణోత్సవానికి వెళ్తుండగా ధర్మారంలో కాంగ్రెస్ అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. నాయకులు దేవి జనార్ధన్, చింతల జగన్‌మోహన్‌రెడ్డి, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, కాంపెల్లి రాజేశం, చిప్ప మణిశర్మ, కాడె సూర్యానారాయణ, పాలకుర్తి రాజేశం, దేవి లావణ్య తదితరులు ఉన్నారు.

● ధర్మారం : మండలంలోని కటికెనపల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం రాష్ట్రీయ బాలా స్వాస్త కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ సూచనలను వివరించారు. ఉచితంగా మందులను అందజేశారు. ఇన్‌చార్జీ హెచ్‌ఎం నూతి మల్లయ్య, సీఆర్‌పీలు కుమారస్వామి, సంధ్య, ఆర్‌బీఎస్ వైద్య సిబ్బంది అదిబా, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

● కమాన్‌పూర్ : మండలంలోని రొంపికుంట గ్రామపంచాయతీ పరిధిలోని తెనుగుపల్లె గ్రామానికి చెందిన తాళ్ల తిరుపతి జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం డైరెక్టర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ మత్స్యకారుల అభివృద్ధికి పాటుపడుతానన్నారు. తన ఎన్నికకు సహకరించిన రామగిరి, కమాన్‌పూర్ మండలాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు, సొసైటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

● కాల్వశ్రీరాంపూర్ : తెలంగాణ ధూప దీప అర్చక సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధిగా, జిల్లా అధ్యక్షునిగా తురుక్కోవళ్లురు శ్రీనివాసమూర్తి, రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా నిట్టూరి అంబరీశర్మ నియమితులయ్యారు. గురువారం హైదరాబాద్‌లోని సారస్వత భవనంలో ఎన్నిక జరిగినట్టు నిట్టూరి అంబరీశర్మ తెలిపారు.

● రామగిరి : మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన రేండ్ల తిరుపతి ఇటీవల న్యాయశాఖ కార్యదర్శిగా కీలక బాధ్యతలు చేపట్టారు. గురువారం గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ వేము కనకయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతిని ఘనంగా సన్మానించారు.

● మంథని : జడ్పీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధును పెద్దపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నేత దాసరి ఉష గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. బీఎస్పీ నుంచి ఇటీవల బీఆర్‌ఎస్ పార్టీలో చేరిన దాసరి ఉష మంథనిలో పుట్ట మధు కలిశారు. ఈ సందర్భంగా పార్టీకి చెందిన పలు అంశాలు చర్చించారు.

● పెద్దపల్లి రూరల్ : మండలంలోని రాఘవపూర్‌లో చిరుతల రామాయణం కమిటీ ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా మహిళలు బోనం ఎత్తుకొని పోచమ్మ ఆలయానికి చేరుకొని మొక్కులను సమర్పించారు. రామాయణ భక్త మండలి సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

● కోల్‌సిటీ : పీసీసీ కార్యదర్శి పెద్దెల్లి కార్యదర్శి తల్లి మధునమ్మను గురువారం సాయంత్రం మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శించారు. మధునమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రకాష్ ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి వెంట కార్పొరేటర్లు పెద్దెల్లి తేజస్విని, బొంతల రాజేష్, నాయకులు నరేందర్‌రెడ్డి, సదానందం, మారెల్లి రాజిరెడ్డి, జక్కుల దామోదర్, తిప్పారపు శ్రీనివాస్, నాయిని ఓదెలు ఉన్నారు.

● ధర్మారం : మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల దాడిలో తీవ్రంగా గాయపడిన బీఆర్‌ఎస్ నాయకుడు సల్వాజీ మాధవరావును బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, దాసరి ఉష గురువారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని వారు అడిగి తెలుసుకున్నారు. వెంట బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, మహిళ నాయకులు కాంపెల్లి అపర్ణ, మోకనపల్లి రాజమ్మ తదితరులు ఉన్నారు.

● రామగిరి : మండలంలోని లద్నాపూర్ గ్రామస్తులు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ సమస్యపై గురువారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఏకరువుపెట్టారు. సింగరేణి ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని ఓసీపీ-2 విస్తరణలో కోల్పోయిన 242 గృహాలకు సంబంధించిన తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కల్పించడంలేదని వాపోయారు. తాము మరో ప్రాంతానికి వెళ్లక ముందే తమ గృహాలను కూల్చివేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై మంత్రి స్పందిస్తూ లద్నాపూర్ గ్రామస్తులకు అండగా ఉంటామని, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రొడ్డ బాపు తల్లి లక్ష్మి దశదిన కర్మకు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పెద్దపల్లి అభ్యర్థిగా వంశీకృష్ణ

- మాజీ ఎంపీ వివేక్ వారసుడిగా ఎన్నికల బరిలోకి.. - అధికారికంగా ప్రకటించిన ఏఐసీసీ


గడ్డం వంశీకృష్ణ

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ పేరును ఖరారు చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ గురువారం రాత్రి అధికారికంగా ప్రకటించారు. గత రెండు, మూడు రోజుల నుంచే పెద్దపల్లి అభ్యర్థిగా గడ్డం వంశీకృష్ణ పేరు ఖరారు అయ్యిందని వార్తలు వస్తున్నప్పటికీ, అధికారికంగా ఏఐసీసీ జాబితాను విడుదల చేయకపోవడంతో ఆశావహుల్లో కొంత మేరకు ఆశలు సజీవంగా ఉంటూ వస్తున్నాయి. గత కొన్ని రోజులుగా పెద్దపల్లి టికెట్ ఎవరికి వస్తుందని ఉత్కంఠ రేపింది. పెద్దపల్లి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు నియోజకవర్గాల్లో గడిచిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయడంతో టికెట్ వస్తే గెలవడం సునాయాసమేనని భావించిన అనేకమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్దపల్లి టికెట్ ఆశించారు. టీపీసీసీకి 29 మంది నాయకులు దరఖాస్తు చేసుకున్నారు. మరోవైపు పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన నాయకులకే ఇవ్వాలని డిమాండ్లు పెరిగాయి. ఆ వర్గానికి చెందిన వివిధ సంఘాల నాయకులు పలు రూపాల్లో కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు ఏఐసీసీ పెద్దలకు కూడా వినతి పత్రాలు అందజేశారు. దీంతో కొంత డైలమా ఏర్పడింది. పెద్దపల్లి టికెట్ కోసం మాల సామాజిక వర్గానికి చెందిన మాజీ ఎంపీ చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ తనయుడు గడ్డం వంశీకృష్ణ దరఖాస్తు చేసుకున్నారు. అలాగే మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారిలో మాజీ ఎంపీ డాక్టర్ పి సుగుణ కుమారి, ఊట్ల వరప్రసాద్, ఆసంపల్లి శ్రీనివాస్, గజ్జెల కాంతం, పెర్క శ్యాం, నేతకాని సామాజిక వర్గం నుంచి గోమాసే శ్రీనివాస్, తదితరులు దరఖాస్తు చేసుకున్నారు. అలాగే సిట్టింగ్ ఎంపీ బొర్లకుంట వెంకటేష్ నేత బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరి ఆయన టికెట్ రేస్‌లో నిలిచారు. ఒక దశలో ఆయనకే టికెట్ వస్తుందనే ప్రచారం జరిగింది. ఏఐసీసీకి టీపీసీసీ నుంచి గడ్డం వంశీకృష్ణతో పాటు మాజీ ఎంపీ డాక్టర్ సి సుగుణ కుమారి, సిట్టింగ్ ఎంపీ వెంకటేష్ నేత, ఊట్ల వరప్రసాద్, అసంపల్లి శ్రీనివాస్ తదితరుల పేర్లు పంపించారు. కాంగ్రెస్ పార్టీ కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం సమావేశమై పెద్దపల్లి అభ్యర్థి ఎంపిక విషయంలో ఏకాభిప్రాయానికి వచ్చారు. గడ్డం వంశీ కృష్ణ పేరును ఖరారు చేశారు.

వివేక్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం..

పెద్దపల్లి పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థిగా ఖరారైన గడ్డం వంశీకృష్ణ మాజీ ఎంపీ, చెన్నూరు ఎమ్మెల్యే డాక్టర్ గడ్డం వివేక్ వారసుడిగా రాజకీయ అరంగేట్రం ఈ ఎన్నికల ద్వారా చేయబోతున్నారు. విశాఖ ఇండస్ట్రీస్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న వంశీకృష్ణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు రాజకీయాల్లోకి వచ్చారు. బీజేపీలో కొనసాగుతున్న వివేక్ తన కుమారుడితో పాటు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అప్పుడు చెన్నూరు నియోజకవర్గం నుంచి వంశీకృష్ణను పోటీలో నిలపాలని రేవంత్ రెడ్డికి వివేక్ సూచించినప్పటికీ, తను వద్దని మీరే పోటీలో నిలబడాలని సూచించిన మేరకు వివేక్ ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. అదే సమయంలో వంశీకృష్ణకు ఎంపీ టికెట్ ఇస్తామని ఇచ్చిన హామీ మేరకు ఆయనకు టికెట్ దక్కింది. పెద్దపల్లి పార్లమెంటు నుంచి గతంలో పలుసార్లు వంశీకృష్ణ తాత అయిన గడ్డం వెంకటస్వామి పోటీ చేసి గెలుపొందారు. అంతేకాకుండా కేంద్ర మంత్రి పదవిని కూడా చేపట్టారు. ఆయన వారసుడిగా 2009లో గడ్డం వివేక్ పెద్దపల్లి నుంచి పోటీ చేసి గెలుపొందారు. ఆ తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో ఓటమి చెందారు.

వివేక్ కాంగ్రెస్ తర్వాత బీఆర్‌ఎస్, ఆ తర్వాత కాంగ్రెస్, ఆ తర్వాత బీఆర్‌ఎస్, ఆ తర్వాత బీజేపీ, ఆ తర్వాత కాంగ్రెస్లో చేరారు. అయిన తర్వాత ఆయన వారసుడిగా గడ్డం వంశీకృష్ణ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. గెలుపోటములు ఎలా ఉంటాయో వేచి చూడాల్సిందే.

రామగుండంలో పర్యటించిన ఎన్టీపీసీ ఆర్‌ఈడీ

జ్యోతినగర్, మార్చి 21: ఎన్టీపీసీ రీజినల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(దక్షిణ) ప్రేంప్రకాష్ గురువారం రామగుండంలో పర్యటించారు. బుధవారం రాత్రి ఎన్టీపీసీకి చేరుకున్న ఆర్‌ఈడీ ప్రేంప్రకాష్‌కు వీజీపీ గెస్ట్ హౌస్(జ్యోతిభవన్)లో ప్రాజెక్టు ఈడీ కేదార్ రంజన్ పాండు,ఇతర అధికారులు స్వాగతం పలికారు. గురువారం ఉదయం తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట(టీఎస్‌టీపీపీ)లో ఆర్‌ఈడీ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన టీఎస్‌టీపీపీలోని కీలకమైన విభాగాలను పరిశీలించారు. మధ్యాహ్నం 2600మెగావాట్ల రామగుండం ఎన్టీపీసీ ప్రాజెక్టులో పర్యటించారు. 7వ యూనిట్ కంట్రోల్‌ను పరిశీలించి ప్లాంటు పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అడ్మినిస్ట్రేషన్ భవనం(ఏడీఎం)లో ప్రాజెక్టు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రామగుండం, తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టుల్లో నాణ్యమైన, రక్షణతో కూడిన విద్యుత్ ఉత్పత్తికి కృషి చేయాలని ఆర్‌ఈడీ అధికారులకు సూచించారు. ప్రాజెక్టులకు బొగ్గు కొరత సమస్యల ఎదురుకాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని, వేసవిలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే నేపథ్యంలో ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో తరువాత ఆర్‌ఈడీ ప్రేం ప్రకాష్ కార్మిక సంఘాలు, అసోసియేషన్ల ప్రతినిధులతో సమావే శమయ్యారు. కాగా, ఆర్‌ఈడీ శుక్రవారం 100 మెగా వాట్ల ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులో పర్యటించి మధ్యా హ్నం హైదరాబాద్‌కు వెళ్లనున్నారు.


తెలంగాణ ఎన్టీపీసీ ప్రాజెక్టులో పర్యటిస్తున్న ఆర్‌ఈడీ ప్రేం ప్రకాష్

అన్నిరంగాల్లో మంథని అభివృద్ధికి ప్రత్యేక కృషి

- మంత్రి శ్రీధర్‌బాబు

మంథని, మార్చి 21: మున్సిపాలిటీ నూతన పాలకవర్గం సహకారంతో రాబోయే రోజుల్లో మంథనిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హామీ ఇచ్చారు. హైదరాబాద్‌లో మంత్రి శ్రీధర్‌బాబును మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ-సురేష్‌రెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గం కలిసి ఘనంగా సన్మానించారు. మున్సిపల్ అవిశ్వాసం ప్రక్రియను విజయవంతం చేసిన కాంగ్రెస్ నేతలు ఇనుముల సతీష్, ఉప్పట్ల శ్రీనివాస్, ముస్కుల లోకేందర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డిలను సైతం మంత్రి శ్రీధర్‌బాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ సురేష్‌రెడ్డిలు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వారితో మాట్లాడుతూ నూతన పాలక వర్గానికి అభినందనలు తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్‌కు రెండు రోజుల ముందే మంథని పట్టణ అభివృద్ధి కోసం రూ. 22 కోట్ల నిధులను ప్రభుత్వం నుంచి విడుదల చేయించామన్నారు. ఎన్నికలు అనంతరం పనులను యుద్ధ ప్రాతిపదికన చేసే విధంగా చైర్‌పర్సన్, కౌన్సిలర్స్ కృషి చేయాలని కోరారు. పట్టణ ప్రజలు కోరుకునే ఆదర్శవంతమైన, నీతివంతమైన పరిపాలన అందిస్తామని, కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టను పెంచే విధంగా కొత్త పాలకవర్గం పరిపాలన ఉండాలని సూచించారు. ఈకార్యక్రమంలో పెద్దపల్లి మాజీ ఎంపీ డాక్టర్ సుగుణకుమారి, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.


మంత్రి శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ

వాహనాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలి

- కమిషనర్ శ్రీకాంత్


పారిశుధ్య సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీకాంత్


కోల్‌సిటీ, మార్చి 21: రామగుండం నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగంలో వాహనాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని, పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా చేపట్టాలని కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ పారిశుధ్య విభాగం ఉద్యోగులు, సిబ్బందిని ఆదేశించారు. గురువారం తెల్లవారుజామున ట్రాలీ డ్రైవర్లతో ఆయన మాట్లాడారు. ట్రాలీల నుంచి ప్రతి ఇంటా చెత్త సేకరణ చేయాలని, చెత్త ఆరుబయట పడవేయకుండా సూపర్‌వైజర్లు, సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. డ్రైవర్లు ఇంధనాన్ని ఆదా చేయడంపై దృష్టి పెట్టాలన్నారు. సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజర్ కావద్దని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. పారిశుధ్య నిర్వహణ తీరుపైనే నగర ప్రజల ఆరోగ్యం ముడిపడి ఉంటుందన్నారు. ప్రతి ఇంటినుంచి చెత్త సేకరించాలని, ఇంటి వద్దనే తడిచెత్తను, పొడి చెత్తను వేరు చేసేలా గృహస్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సునీల్, నాగభూషణం పాల్గొన్నారు.

బ్యాంకర్లతో సమావేశమైన పెద్దపల్లి ఏసీపీ

పెద్దపల్లిటౌన్, మార్చి 21: జిల్లా కేంద్రంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ గజ్జి కృష్ణ మాట్లాడుతూ పెద్దపల్లి సబ్‌డివిజన్ పరిధిలో ఏటీఎం దొంగతనాలు, సైబర్‌క్రైమ్స్, ఏటీఎం చీటింగ్ జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పెద్దపల్లిలో బ్యాంకర్ల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎంతో కష్టపడి సంపాదించి, దాచుకున్న సొమ్మును ఎక్కడో ఉన్న దొంగలు సెల్‌ఫోన్, ఏటీఎంల నుంచి దోచుకుంటున్నారన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు మేథోమధనం నిర్వహించామన్నారు. బ్యాంకర్లు సూచనలు, సలహాలు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి ఏర్పాట్లు చేస్తే దొంగతనాలు నివారించవచ్చు, అనే విషయంలో చర్చించి, ఆత్మపరిశీలన చేసుకోవడం జరిగిందన్నారు. పిలవగానే వచ్చి సలహాలు, సూచనలు ఇచ్చిన బ్యాంకర్లకు ధన్యవాదాలు తెలిపారు. పెద్దపల్లి సీఐ ఆర్. కృష్ణ మాట్లాడుతూ ఏటీఎం దొంగతనాలు రాత్రి సమయాల్లో జరుగుతున్నాయని, ఏటీఎం పరిసరాల్లో రెండు నైట్‌విజన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏటీఎం అటెండ్ చేసిన క్రైమ్ అవుతుందని, టచ్‌చేస్తే అలారం రావాలని, కానీ చాలా అన్నిచోట్ల వర్కింగ్ కండిషన్‌లో ఉండడం లేదని, కండిషన్లో ఉండే విధంగా చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఎస్సై లక్ష్మణ్ రావు, బ్యాంక్ అధికారులు చేగొండ వెంకటేశం, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో సుదర్శన హోమం

సుల్తానాబాద్, మార్చి 21: స్థానిక శ్రీవేణుగోపాల స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. గురువారం ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన యాగశాలలో సుదర్శన హోమాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను టీటీడీ అర్చక బృందం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి రుక్మిణీ సత్యభామ సమేత శ్రీవేణుగోపాల స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే విజరమణారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పల్లా మురళి, అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. గురువారం సుదర్శనహోమం అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీతో ఊరేగించారు. శుక్రవారం చక్ర స్నానం పుష్ప యాగం కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంను పురస్కరించుకుని భక్తులకు అన్నదానం చేస్తున్నట్లు ఆలయ చైర్మన్ పల్లా మురళి తెలిపారు.



ఆన్‌లైన్ పీఎంఈ, ఐఎంఈపై అవగాహన

రామగిరి, మార్చి 21: సింగరేణి హెచ్‌ఆర్‌డీ విభాగం ఆధ్వర్యంలో ఆన్‌లైన్‌లో ఐఎంఈ, పీఎంఈ చేసే పద్ధతిపై గురువారం జీఎంకార్యాలయంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంట్రాక్టు ఉద్యోగులు, ఉద్యోగులు, ఎంవిటిసీ ట్రైనింగ్‌తో పాటు మెడికల్ ఐఎంఈ, పీఎంఈ చేసే సమయంలో అభ్యర్థులు అభ్యర్థన రాతపూర్వకంగా కాకుండా ఆన్‌లైన్ పద్ధతిలో చేసే విధానంపై కార్పొరేట్ ఐటీ డీజీఎం హరిశంకర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు సీహెచ్ వెంకటరమణ, రవీందర్‌రెడ్డి, కళ్యాణ్ చక్రవర్తి, మల్లన్న, ఆసిఫ్ యాసిన్, రవీందర్, రాజేశ్వరి, నాగదీప, రిష్మ, సునీల్‌ప్రసాద్, రాజేశం, మురళి, రవిచంద్ర, సాయికృష్ణ, అధికారులు, క్లరికల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీఏ ఎస్‌వోటూ జీఎంగా సత్యనారాయణ

రామగిరి, మార్చి 21: సింగరేణి సంస్థ ఏపిఏ నూతన ఎస్‌వోటూ జీఎంగా బండి సత్యనారయణ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు ఉత్తర్వులను అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు సీతారామం, రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-3ని సందర్శించిన డైరెక్టర్(ఆపరేషన్స్)

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: ఆర్జీ-2 పరిధిలోని ఓసీపీ-3 ప్రాజెక్టును గురువారం డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీ శ్రీనివాస్ సందర్శించారు. వ్యూ పాయింట్ నుండి ప్రాజెక్టు పని స్థలాలను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి మెరుగుపడేలా చేపట్టాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. వార్షిక లక్ష్య సాధనకు మిగిలి ఉన్న 10రోజుల్లో ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, పని గంటలను సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని సూచించారు. వెంట జీఎం సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, మేనేజర్‌రమేష్, ఎస్ఈ పవం సిస్టం నర్సింహులు, సర్వేఅధికారి చంద్రమౌళి, ఎస్ఎస్‌వో షరీఫ్‌మహమ్మద్ ఉన్నారు.



వ్యూ పాయింట్ వద్ద ఓసీపీ-3 ప్లాన్ పరిశీలిస్తున్న డైరెక్టర్


పూజల్లో పాల్గొన్న భక్తులు

కన్నుల పండువగా వెంకన్న బ్రహ్మోత్సవాలు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 21: వెంకటేశ్వర స్వామి 38వ ఆలయ బ్రహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. గురువారం వాస్తు పూజ, నిత్యహవనము, సుదర్శన హోమం వంటి ప్రత్యేక పూజాకార్యక్రమాలు జరిగాయి. ఈ పూజా కార్యక్రమాల్లో సింగరేణి డైరెక్టర్(ఆపరేషన్స్) ఎన్వీకే శ్రీనివాస్, ఆర్జీ-2,1 జీఎంలు సూర్యనారాయణ, చింతల శ్రీనివాస్‌తో పాటు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

ఓదెల, మార్చి 21: మండల కేంద్రానికి చెందిన ముద్దసాని వెంకటసాయి ఆరు రోజుల క్రితం మృతిచెందగా గురువారం ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పరామర్శించారు. మృతుడి తండ్రి రమేష్, పెద్దనాన్న కుమారస్వామిని ఎమ్మెల్యే ఓదార్చారు. మరో వృద్ధురాలు అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మూల ప్రేంసాగర్‌రెడ్డి, బోడకుంట శంకర్, గడిగొప్పుల నరేష్, సంతోష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల చేయూత

పెద్దపల్లి రూరల్, మార్చి 21 : మండలంలోని పెద్దబోంకూరులో ఇటీవల అకాల మరణం చెందిన ఎనగందుల సంజీవ్ కుటుంబానికి స్నేహితులు చేయూతనందించారు. స్నేహితులు కలిసి మృతుడి కూతురి పేరున రూ.10 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మిట్టపల్లి శ్రీనివాస్, కారుపాకల నాగరాజు, ఎనగందుల శ్రీనివాస్, సామల సతీష్, అబ్బోజు పవన్ కళ్యాణ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సెస్సీ పరీక్షకు 12 మంది విద్యార్థుల గైర్హాజరు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 21: జిల్లాలో గురువారం నిర్వహించిన పదో తరగతి ఇంగ్లీష్ పరీక్షకు 12 మంది గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారి డి.మాధవి ఒక ప్రకటనలో తెలిపారు. 7,717 విద్యార్థులకు గాను 7,705 మంది పరీక్షకు హాజరయ్యారన్నారు. 99.8 శాతం హాజరు నమోదు అయినట్లు ఆమె తెలిపారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 16 సెంటర్‌లను, డీఈవో 5 పరీక్ష కేంద్రాలను పరిశీలించినట్లు పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ బుక్ కాలేదని తెలిపారు.

పదో తరగతి పరీక్షా కేంద్రాల తనిఖీ

పాలకుర్తి, మార్చి 21: మండలం పరిధిలోని బసంత్‌నగర్, జయ్యారం గ్రామాల్లోని పదవతరగతి పరీక్ష కేంద్రాలను గురువారం బసంత్‌నగర్ ఎస్ఐ ఆర్ స్వామి పరిశీలించారు. రెండు కేంద్రాల్లో 325 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాస్తున్నారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళనలకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని అన్నారు. అనంతరం వేంనూర్, బసంత్‌నగర్ టోల్‌ప్లాజాల వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టులను పరిశీలించారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున వాహనాల్లో రూ.50 వేలకు మించి నగదును తీసుకెళ్తే సీజ్ చేస్తామన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులు

పాలకుర్తి, మార్చి 21: మండల పరిధిలోని బసంత్‌నగర్ ఐఎంఎస్ పాఠశాల విద్యార్థులు ఆర్.జస్వంత్, పి.అక్షిత్, ఎం.అంజన్‌సాయిగౌడ్‌లు తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కోచ్ ఎం.కృష్ణమూర్తి గౌడ్ గురువారం తెలిపారు. వీరు ఈ నెల 22నుంచి 24 వరకు భువనగిరిలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ మహేంద్రన్, కేశోరాం యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

స్వర్ణకార సంఘం పట్టణ అధ్యక్షుడిగా సత్యనారాయణ

సుల్తానాబాద్, మార్చి 21: సుల్తానాబాద్ పట్టణ స్వర్ణకార సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పొలాస సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా కందుకూరి పెద్దన్న ప్రకాష్‌రావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కాసర్ల రాజమౌళి, గౌరవాధ్యక్షులుగా బొజ్జ శంకరయ్య, ఉపాధ్యక్షులుగా చారి, సహాయ కార్యదర్శిగా వెంకటస్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పొలాస ప్రదీప్ కుమార్‌లు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రంగు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రాజు, రాష్ట్ర నాయకులు పూర్ణాచారి, వెంకటనర్సయ్య, సదానందం, శ్రీనివాస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం

కోల్‌సిటీ టౌన్, మార్చి 21: నాలుగు నెలల క్రితం కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి గురువారం మరణించిన గోదావరిఖని శివనగర్‌కు చెందిన మంజుల(55) నేత్రాలను ఆమె కుటుంబ సభ్యులు దానం చేశారు. మంజుల నేత్రాలను ఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంక్ టెక్నీషియన్ లక్ష్మణ్ సేకరించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, జాతీయ కార్యదర్శి లింగమూర్తి, బీష్మాచారి, సానా రామకృష్ణారెడ్డి, నూక రమేష్, చంద్రమౌళి, రాజమొగిలి, తానిపర్తి విజయలక్ష్మి, జెనిగోపాల్ త్రివేదిలు పాల్గొన్నారు.

ఎన్టీపీసీలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

జ్యోతినగర్, మార్చి 21: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌రాజ్ ఠాకూర్ గురువారం ఎన్టీపీసీలో హబ్సియా మసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. కార్యక్రమంలో మసీదు పెద్దలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడికి మంత్రి, ఎమ్మెల్సీ నివాళి

అంతర్గాం, మార్చి 21: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ సోదరుడు శైలేందర్‌సింగ్ ప్రథమ వర్ధంతి సందర్భంగా గురువారం రామగుండంలో ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలు శైలేందర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మేయర్ అనిల్ కుమార్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ సంఘాల నాయకులు శైలేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఠాకూర్ అయోధ్యసింగ్, మహంకాళి స్వామి, ఉరిమెట్ల రాజలింగం, బందారపు బుగ్గరాములుగౌడ్, సింగం కిరణ్‌గౌడ్, మడ్డి తిరుపతిగౌడ్, వెంకటేష్‌గౌడ్, కొలిపాక సుజాత, ఈదునూరి హరిప్రసాద్, ఎస్‌కే ఇఫ్తాకర్ పాల్గొన్నారు.

ఈజీఎస్ పనుల పరిశీలన

రామగిరి, మార్చి 21: మండలంలోని రత్నాపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ఈజీఎస్ పనులను డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్ గురువారం పరిశీలించారు. గ్రామంలో ట్రెంచ్ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కూలీలకు రోజువారి వేతనం రూ.272 రూపాయలు ఉంటుందని కూలీ గిట్టుబాటు అయ్యేలా చూడాలని టీఏ, ఎఫ్‌ఏలకు సూచించారు. వీరి వెంట ఏపీడీ సత్యనారాయణ, టీఏలు అఖిల, సుప్రియ, ఎఫ్‌ఏ జ్యోతి పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్

మంథనిరూరల్, మార్చి 21: మండలంలోని సిరిపురం గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీ బ్యారేజీకి వెళ్లే రోడ్డులో అక్రమంగా గోదావరి నది ఇసుక డంప్‌ను గురువారం అధికారులు గుర్తించినట్లు తహశీల్దార్ రాజయ్య తెలిపారు. గుర్తించిన ఇసుక దాదాపు 25 ట్రాక్టర్ల వరకు ఉంటుందని, సీజ్ చేసిన ఇసుకను స్థానిక గ్రామ పంచాయతీ వద్దకు తరలించి కార్యదర్శి కస్టడీకి అప్పగించి సమాచారాన్ని స్థానిక పోలీసుకు ఇచ్చినట్లు తెలిపారు.

బెల్ట్ షాపులపై కొరడా

పాలకుర్తి, మార్చి 21: బెల్ట్ షాపులపై ఎక్సైజ్ పోలీసులు కొరడా ఝుళిపించారు. గురువారం మండలం పరిధిలోని పలు గ్రామాల్లో దాడులు చేసి మద్యాన్ని సీజ్ చేశారు. పలువురిపై కేసులు సైతం నమోదు చేశారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది ఖదీర్, ప్రసాద్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.